
క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇల వేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం, బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పొన్న వాహనంపై గ్రామోత్సవం


పొన్నవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

పిఠాపురం: మండలంలోని మూలపేటలో వేంచేసిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి, సత్యనారాయణ స్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివార్లకు పొన్న వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత పండితులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం రథోత్సవాన్ని పురస్కరించుకుని కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి


కొత్త మూలపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకట నారాయణ

పిఠాపురం: గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్త మూలపేటలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 70 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో అతి సమస్యాత్మక కేంద్రాలు 22 ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఉప్పాడ, కొత్తమూలపేట, కుతుకుడుమిల్లి, అమీనాబాదు గ్రామాలతో పాటు పలు గ్రామాలపై మరింత దృష్టి సారించినట్టు తెలిపారు. పూర్తిస్థాయిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

గణితం పరీక్షకు 118 మంది డుమ్మా

సామర్లకోట: 10వ తరగతి పరీక్షలలో భాగంగా శుక్రవారం జరిగిన లెక్కల పరీక్షలకు 118 మంది డుమ్మా కొట్టినట్టు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో నాలుగు, మండల పరిధిలో ఐదు పరీక్షా కేంద్రాలల్లో పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 1564 మంది పరీక్ష రాయవలసి ఉండగా 10 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా ప్రైవేటు విద్యార్థులు 351 మంది హాజరు కావలసి ఉండగా 108 మంది డుమ్మా కొట్టినట్టు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ చెప్పారు.

వాహనాల తనిఖీ


సామర్లకోటలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: అత్యవసర పరిస్థితులలో నగదు వెంట తీసుకొని వెళ్లే సమయంలో పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యుడు కర్రి హరికృష్ణ సత్యారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలో పెద్దాపురం–ప్రత్తిపాడు రోడ్డులో వెళ్తున్న వాహనాలను స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణసత్యారెడ్డి మాట్లాడుతూ వివాహాలకు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లే వారు వెంట నగదు తీసుకొని వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉండాలన్నారు. అనుమతి లేకుండా నగదు, మద్యం వాహనాలలో ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల పరిధిలో ఉండూరు, పి.వేమవరం, అచ్చంపేట గ్రామాల్లో పర్యటించి ఎన్నికల కోడ్ నిబంధనలను రాజకీయ పార్టీ నాయకులకు వివరించారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- స్థానికుడిగా జగనన్న అవకాశమిచ్చారు
- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించండి
- తిరుపతి ఎన్నికల ప్రచారం ప్రారంభంలో పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి


తిరుపతిలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న దొరబాబు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి సాక్షిగా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం తథ్యమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కుంచే అమరావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి దొరబాబు మాట్లాడుతూ మీలో ఒక్కడిని.. స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడిగా జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఆదరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించాలని దొరబాబు కోరారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన సీఎం జగన్ అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించుకోవాలన్నారు. పార్టీ రహితంగా అర్హులందరికీ నవరత్న పథకాల ద్వారా సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుంతుందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీకి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అగాహన ఉందని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించే అవకాశం 20 ఏళ్ల నిరీక్షణ అనంతరం వచ్చిందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆదరించి స్థానికుడినైనా నన్ను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌కు ఓటేసి గెలిపించాలని దొరబాబు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, గోపు మురళి, పెంటా విజయ్‌కుమార్, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల నానాజీ, ఒబిలిశెట్టి అబ్బాయి, కుంచే వెంకన్న, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కమిటీల నియామకం

సామర్లకోట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుని ఆదేశాల మేరకు మున్సిపాలిటీలు మండల కమిటీలను కొత్తగా నియమించారు. దీనిలో భాగంగా పెద్దాపురం మండల పార్టీ అధ్యక్షుడిగా గవరసాని సూరిబాబు (జెడ్పీటీసీ సభ్యుడు), ఉపాధ్యక్షులుగా గోలి రామారావు, గుండేపల్లి వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శులుగా చుండ్రు సురేష్, సీహెచ్ సత్యనారాయణ, జె.వెంకటరమణ, కార్యదర్శులుగా ఎస్.వెంకటరమణ, గొల్లపల్లి వెంకటరమణ, కొత్త తాతయ్య, బొండు రాజు, కె.లోవరాజు, కోశాధికారిగా కుండల ప్రసాద్, 13 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లతో పెద్దాపురం మండల కమిటీని ఎంపిక చేశారు. అదే విధంగా పెద్దాపురం పట్టణ కమిటీ అధ్యక్షుడిగా కాపుగంటి కామేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా తూటిక సత్యనారాయణ, పెదిరెడ్డి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా జి. యాకోబు, బి.హరిబాబు, కార్యదర్శులుగా వి.ఏసుబాబు, వి.గంగ, షేక్ జానీ, ఆర్.సత్తిబాబు, కోశాధికారిగా కంచర్ల పట్టాభిరామ్మోహన్, 14 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిన న్యాయవాది


మలిరెడ్డి ప్రసాద్‌ను అభినందిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పట్టణానికి చెందిన న్యాయవాది మలిరెడ్డి ప్రసాద్ శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. టీడీపీ మద్దతుదారుడైన ప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ కండువా వేసి ఆహ్వానించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరినట్టు ఆయన తెలిపారు. అలాగే దవులూరి విజయానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ కమిటీ చైర్మన్ పాగా సురేష్‌కుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు


కిర్లంపూడిలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కిర్లంపూడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. మండలంలోని కిర్లంపూడి, రాజుపాలెం, వీరవరం గ్రామాల్లో ఏఆర్ ఆడిషనల్ డీఎస్పీ సత్యనారాయణ, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్సై షేక్ జబీర్ ఆధ్వర్యంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలందరికీ ప్రశాంత ఎన్నికలపై భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అదనపు పరిశీలకుడిగా షేక్ బాబ్జాన్


షేక్ బాబ్జాన్

పిఠాపురం: వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ అదనపు పరిశీలకుడిగా పార్టీ మైనార్టీ నేత షేక్ బాబ్జాన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ పరిశీలకుడిగా శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన గౌతు సుబ్రహ్మణ్యం ఉన్నారు. ఆయనతో పాటు అదనంగా మైనార్టీ నేత షేక్ బాబ్జాన్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించి పార్టీ విజయానికి కృషి చేస్తానని బాబ్జాన్ తెలిపారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడంతో పాటు పిఠాపురంలో కాకినాడ ఎంపీ వంగా గీతను అత్యధిక మెజార్టీతో గెలిపించి తీరుతామని ఆయన తెలిపారు.

వైభవంగా శ్రీవారి ఊంజల్ సేవ


పిఠాపురంలో వేంకటేశ్వరస్వామి ఊంజల్ సేవ

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి ఊంజల్ సేవ కనుల వైకుంఠంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పి రామకృష్ణమాచార్యులు, పి.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఊంజల్ సేవను కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



తోలుబొమ్మలాట ప్రదర్శనకు మేకతోలుతో తయారు చేసిన వివిధ దేవతా మూర్తులు, జంతువుల బొమ్మలు

తోలుబొమ్మలకు ప్రాణం పోయండి

- ఆదరణ కరువై పాతబట్టలు అమ్ముకుంటున్న ప్రాణమున్న బొమ్మలు
- గతమెంతో ఘనమైన విశిష్ట జానపద కళ
- చేతనైన సాయం చేసిన నటి జమున
- కళను బతికించాలని కోరుతున్న కళాకారులు


తోలు బొమ్మలాటలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

సామర్లకోట: తోలుబొమ్మలాట కళాకారులు అనగానే సామర్లకోట మండలం జమునానగర్ గుర్తుకు వస్తుంది. జానపద కళారూపం నుంచి ఈ కళ పుట్టింది. సుమారు 1200 ఏళ్ల క్రితం మహారాజుల పాలనలో ఈ కళకు గుర్తింపు వచ్చింది. ఆ కాలంలో ఈ కళాకారులను గుర్తించి రాజరిక పాలనపై కథనాలు తయారు చేసి ఆయా పాత్రలతో పాలనా వ్యవహారాలు, లోటుపాట్లు, సామాజిక పరిస్థితులను తెలియజేసేవారు. వీటి ద్వారా వేగుల సమాచారంతో కొన్నిసార్లు పాలనపై అభిప్రాయాలను నాటి రాజులు గ్రహించే వారు. ఇటువంటి తోలు బొమ్మలాట కళాకారులకు నిలయం సామర్లకోట మండలంలోని మాధవపట్నం గ్రామం. వీరు నివసిస్తున్న ప్రాంతాన్ని సందర్శించిన దివంగత సినీ నటి జమున వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించుకునేలా చేశారు. దాంతో ఆ ప్రాంతానికి జమునానగర్‌గా పేరు వచ్చింది. బ్రిటీషు కాలంలో జరిగిన యుద్ధంలో ఎందరో తోలుబొమ్మలాట కళాకారులరు మృతి చెందినట్టు కొందరు పెద్దలు చెప్తారు.

విజ్ఞానం, వినోదం

ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో తమ కళకు గుర్తింపు ఇవ్వాలని తోలుబొమ్మలాట కళాకారులు కోరుతున్నారు. సినిమాలు, నాటకాలు లేని సమయంలో వినోదం, విజ్ఞానం కోసం తోలు బొమ్మలాట ప్రదర్శనలు ఎక్కువగా జరిగేవి. అయితే అటువంటి కళ నేడు అంతరించిపోతోంది. ఉత్తర గోగ్రహణం ప్రదర్శన నిర్వహిస్తే తప్పని సరిగా ఎంత ఎండలు ఉన్నా వర్షం పడి తీరుతుందని కళాకారులు నేటికీ నమ్ముతారు. చదువు లేక పోయినా శ్లోకాలు, సంస్కృతం, పాటలు, పద్యాలు ఆలపించడం వారికి వంశపారంపర్యంగా వచ్చిన కళ. ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి మంది కళాకారులు ఉన్నారని తెలిపారు.

మేక చర్మంతో తోలు బొమ్మలు

మేక చర్మంతో వివిధ రకాల జంతువులు, దేవతలు, మనుషుల బొమ్మలను తయారు చేస్తారు. ఈ కళను తిలకించే వారికి అనేక వ్యాధులు దూరం కావడంతో పాటు, జీవిత కాలం పెరుగుతుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం తోలు బొమ్మలాట కళాకారులు పాత బట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. దేవదాయ శాఖ, సమాచార శాఖ, రేడియో కేంద్రం నుంచి కళాకారుల పోషణ చేస్తున్నారు. తయారు చేసిన బొమ్మలను లేపాక్షి సంస్థకు విక్రయిస్తామని చెప్తున్నారు. కళను ప్రదర్శించడంతో పాటు బొమ్మలను తయారు చేయడం పిల్లలకు తోలుబొమ్మలాటపై శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ఈ మేరకు జమునానగర్‌లో ఒక కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

తోలుబొమ్మలాటను పరిరక్షించాలి



ఈ కళ వల్ల ప్రజలకు దేశానికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ కళను బతికించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి తోలుబొమ్మలాటను ఉపయోగించుకోవడం ద్వారా కళను బతికించే అవకాశం ఉంది. ప్రస్తుత తరానికి తోలుబొమ్మలాట అంటే ఏమిటో తెలియదు. ప్రతి ప్రదర్శనలోను 10 మంది కళాకారులు పాల్గొంటారు. కొత్త తరానికి తొలుబొమ్మలాట పరిచయం చేయడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 60 సంవత్సరాలు నిండిన వృద్ధ కళాకారులకు రూ.ఐదు వేలు పింఛను ఇవ్వాలి.

– తోట పవన్‌కుమార్,
తోలుబొమ్మ కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు,
మాధవపట్నం

ఆలయానికి నూతన ఉత్సవ విగ్రహాల సమర్పణ


ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

పిఠాపురం: స్థానిక కొత్తగూడెంలో వేంచేసిన పట్టాభిరామాలయానికి శుక్రవారం దాతలు నూతన ఉత్సవ విగ్రహాలను బహూకరించినట్లు ఆంధ్రప్రదేశ్ శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు విజయ జనార్దనాచార్యులు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన దాత ధనంజయరాజు, నాగరాజశేష ఆనంద సీతాదేవి దంపతులు విగ్రహాలను అందజేయగా ప్రత్యేక పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ జనార్దనాచార్యులు మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల కోసం ఏర్పడిన సంఘం ద్వారా చిన్న ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సీతారామం, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పి.సత్యనారాయణ, ట్రెజరర్ వాసు, సలహా దారులు వీరబాబు, అప్పల రాజబాబు, నాని తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి కుటుంబ సభ్యులకు భరోసా


గీతాంజలి కుటుంబ సభ్యులతో సోనియా

సామర్లకోట: గీతాంజలి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా కలిసి భరోసా ఇచ్చారు. గీతాంజలిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టడంతో తెనాలిలో ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం సోనియా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఒక హైకోర్టు మహిళా న్యాయవాదిగా, సైకాలజిస్టుగా గీతాంజలి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలియజేసినట్టు తెలిపారు. గీతాంజలి ఇద్దరు కుమార్తెలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొవడానికి ముందుకు వచ్చిందని ఆమె చెప్పారు. గీతాంజలి భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ సేవా సంస్థ ద్వారా తగిన సహాయం చేయడానికి సోనియా చర్యలు తీసుకున్నారు.

బాధిత కుటుంబాలకు ఎంపీ గీత పరామర్శ


కొత్త ఇసుకపల్లిలో కాశిబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ వంగా గీత

కొత్తపల్లి: మండలంలోని పలు బాధిత కుటుంబాలను శుక్రవారం కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పరామర్శించారు. కొత్త ఇసుకపల్లికి చెందిన కునిశెట్టి కాశిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాశీబాబు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే యండపల్లి శివారు జొన్నాలగరువుకు చెందిన కాశి ఏసుబాబు రోడ్డు ప్రమాదంలో గాయపయగా ఎంపీ గీత ఏసుబాబును పరామర్శించారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, యండపల్లి ఎంపీటీసీ బర్రె రవి, నాయకులు జ్యోతుల చక్రబ్బాయి, గింజల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు వేదుల శర్మ, సుధీర్, ఫణి శర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. దేవస్థానం సూపరింటెండెంట్ ఐవీ రామారావుతో పాటు 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువ కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

నిబంధనల మేరకే రేషన్ పంపిణీ చేయాలి


రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు నియమావళిని వివరిస్తున్న తహసీల్దార్

కరప: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందును నిబంధనలకు అనుగుణంగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రేషన్ పంపిణీ, ఎన్నికల కోడ్ అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎండీయూ వాహనాలపైన, చౌకధరల దుకాణాలలో ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఫొటోలు లేకుండా చూసుకోవాలన్నారు. సదరు ఫొటోలపై తెలుపు లేదా ఆకుపచ్చ స్టిక్కర్లతో కవర్ చేయాలన్నారు. రాజకీయ, ఎన్నికల ప్రచారాలలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొనకూడదన్నారు. రేషన్ పంపిణీలో ఇచ్చే బెల్లం, రాగిపిండి తదితర నిత్యావసర వస్తువుల ప్యాకెట్లపై ఉండే సీఎం చిత్రంపైన స్టిక్కర్ అతికించాలన్నారు. ఎండీయూ వాహనాన్ని రేషన్ డోర్ డెలివరీకి మాత్రమే వినియోగించాలని, మరో పనికి ఉపయోగించకూడదదన్నారు. రేషన్‌షాపుల గోడలపై పోస్టర్లు కానీ, రాజకీయ నాయకుల చిత్రాలు కానీ ఉంటే వెంటనే తొలగించాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షతులసి పూజ



బోట్‌క్లబ్: స్థానిక మెహర్ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం లక్షతులసి పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమం నిర్వహించారు. మల్లిపూడి అమర్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది. తులసి పూజ అనంతరం ఆలయ అర్చకులు తులసితో స్వామి వారిని ఎంతో అందంగా అలంకరించారు. రాత్రి సదస్యం ఎంతో వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పీవీ రమణ, కె.సుశీల ఆధ్వర్యంలో ఘంటసాల సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.